సాక్షి
నిర్మల్
శనివారం । 6 । జనవరి । 2024



'మహా'.. భారం! 8లో▸
ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్లది కీలక పాత్ర. ఈ ప్రగతి రథ సారథులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తాజాగా మహాలక్ష్మి పథకంతో పని భారం పెరిగిందంటున్నారు.



పడకేసిన పారిశుధ్యం 9లో▸
నిర్మల్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నారు. మూడు రోజులుగా చెత్త ఎత్తకపోవడంతో పట్టణంలో ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.4 /16.5
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం మళ్లీ పెరుగుతుంది. చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ జానకిషర్మిల శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. కలెక్టర్ కూడా ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రయోగం'పై నివేదిక కోరిన కలెక్టర్



శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం..

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిధుల కొరత, రసాయనాలు, పరికరాల సరఫరాలో జాప్యంతో సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడం లేదు. ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సమస్యపై 'ప్రయోగం .. ఓ పరీక్షే..!' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఆయా కళాశాలల్లో ప్రయోగశాలల స్థితిగతులపై స్పందించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖ నుంచి నివేదిక కోరారని జిల్లా ఇంటర్ విద్యాధికారి పరశురాం తెలిపారు. ఈమేరకు కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని వెల్లడించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: లక్ష్మణచాంద మండలం తిర్పెలి, న్యూ కంజర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అంతరకు ముందు నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డికి కూడా వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో అధికారులకు విన్నవించగా బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు. తర్వాత నిలిపివేశారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నందున బస్సు నడిపేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఈటల శ్రీనివాస్, అట్ల చిన్న రామరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఈటల లచ్చన్న, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, న్యూకంజర్ సర్పంచ్ ప్రభాకర్, దశరథ్, బొర్రన్న, సలీం, లక్ష్మణ్ ఉన్నారు.



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- డీఈవో రవీందర్‌రెడ్డి



విద్యార్థులతో పాఠం చదివిస్తున్న డీఈవో

సోన్: పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీఈవో రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. డీఈవో వెంట జిల్లా మానిటరింగ్ అధికారి నారాయణ, హెచ్‌ఎంలు పరమేశ్వర్, రవికిరణ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పల్లెల్లో కాలుష్యం చిచ్చు!

'ఇథనాల్'లో ఇదే ప్రధానాంశం..

- రైతుల్లో అనేక అనుమానాలు
- 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్'తోపాటు.. జీరో పొల్యూషన్ అంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యం
- రైతులు, అధికారులు, కంపెనీతో కలెక్టర్ సమావేశం
- ఇరువర్గాలతో కమిటీల ఏర్పాటు ఆలోచన..



సమావేశానికి హాజరైన రెండుగ్రామాల ప్రజలు, జిల్లా అధికారులు, మాట్లాడుతున్న కలెక్టర్(ఇన్‌సెట్‌లో)



ఈనెల 3న నిరసనలో వాహనం దహనం

నిర్మల్: ఇథనాల్.. ఇటీవల జిల్లాలో సంచలనంగా మారిన అంశం. దిలావర్‌పూర్–గుండంపల్లి మధ్య పచ్చని పంట చేలలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. వారి ఆందోళన వెనుక ఉన్న ప్రధాన కారణం.. కాలుష్యం. ఈ ఫ్యాక్టరీ పెడితే తమ పంటభూములు ఏమవుతాయో.. తమ గ్రామాలకు ఎలాంటి సమస్యలు వస్తాయో.. అన్న అనుమానాలే చిచ్చురేపాయి. చివరకు ఫ్యాక్టరీపై దాడిచేసే వరకూ వచ్చాయి. ఆందోళనకారులపై కేసులు పెట్టేలా చేశాయి. ఈ అనుమానాలు, అపోహలను ముందే నివృత్తి చేసి ఉంటే పరిస్థితి ఇంతదాకా.. వచ్చేది కాదన్న వాదన వినిపిస్తోంది. తాజా పరిస్థితులపై మాట్లాడుతున్న అధికారులు, కేసులు పెట్టిన పోలీసులు, ఫ్యాక్టరీ యాజమాన్యం ముందే సమస్యను ఎందుకు పసిగట్టలేదన్న ప్రశ్నలూ వస్తున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రంగంలోకి దిగారు.

ఏమవుతుందోనని..
నిర్మల్ ప్రాంతంలో కొన్ని దశాబ్దాలుగా ఇలాంటి పెద్ద ఫ్యాక్టరీలు లేవు. పారిశ్రామిక అభివృద్ధి నామమాత్రంగానే ఉంది. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇప్పుడిప్పుడే జిల్లాలోకి పరిశ్రమలు అడుగుపెడుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉంది. కానీ.. స్థానిక ప్రజలు, రైతులకు ఫ్యాక్టరీ అనగానే వస్తుత్పత్తితోపాటు పారిశ్రామిక కాలుష్యం కళ్ల ముందు కదలాడుతుంది. ప్రస్తుతం ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలోనే ఇదే కనిపిస్తోంది. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానిక రైతులు, గ్రామస్తులను ఎవరిని కదిలించినా కాలుష్యంపైనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో తమ పంటలకు భరోసా, తమ ప్రాంతవాసులకు ఎంతోకొంత ఉపాధి దొరుకుతుందన్న ఆశ ఉన్నప్పటికీ.. దాని ద్వారా పొల్యూషన్ ఎలా ఉంటుందోనన్న అనుమానం ఆందోళనకు దారితీస్తోంది.

కేసుల తీవ్రతపై ఆందోళన..
ఇథనాల్ ఫ్యాక్టరీపై బుధవారం ఇరుగ్రామాలు చేసిన దాడి నేపథ్యంలో పోలీసులు నమోదు చేసిన కేసులు చర్చనీయాంశంగా మారాయి. ఈ దాడి ఘటనలో మొత్తం ఐదు సెక్షన్ల కింద కేసులు పెట్టినట్లు చెబుతున్నారు. ఇందులో ప్రధానంగా హత్యాయత్నం కింద 307 కేసులు పెట్టడం గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది. తమ గ్రామాలు, తమ భూముల పరిరక్షణ కోసం చేపట్టిన ఆందోళనపై ఇంత సీరియస్‌గా వ్యవహరించడం దారుణమంటున్నారు. పోలీసులు వెంటనే ఈ సెక్షన్లను తొలగించాలని కోరుతున్నారు. ఈమేరకు దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఎస్పీ జానకీషర్మిల, డీఎస్పీ గంగారెడ్డిని కలిసి విన్నవించారు.

జీరో పొల్యూషన్..
దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానిక జిల్లా అధికారుల నుంచీ అనుమతులను తీసుకున్నారు. రైతుల ఆందోళనపై సదరు ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్న పీఎంకే కంపెనీ స్పందిస్తూ.. ఇక్కడ పెట్టిన పరిశ్రమ నుంచి జీరో పొల్యూషన్ ఉంటుందని చెబుతోంది. ప్రభుత్వాలు సూచించిన నిబంధనల ప్రకారమే తమ ఫ్యాక్టరీని కొనసాగిస్తామంటోంది. భూగర్భజలాలు, గోదావరి నీళ్లు కాలుష్యం అవుతాయన్న అపోహ వద్దని, తమ ఫ్యాక్టరీలో 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానాన్ని అవలంబిస్తామని పేర్కొంటోంది. గాలి కాలుష్యం కాకుండా జీరో పొల్యూషన్ కోసం నిబంధనల ప్రకారం చర్యలు చేపడుతున్నట్లు చెబుతోంది. రైతులు పండించిన పంటల ద్వారానే పరిశ్రమ నడుస్తుందని, వారికే లాభదాయకంగా ఉంటుందని వెల్లడిస్తోంది.

కలెక్టర్ సమావేశం..
జిల్లాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసిన ఇథనాల్ ఫ్యాక్టరీ అంశంపై కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ స్పందించారు. కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులు, దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు, రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు, గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారి అనుమానాలు, అపోహలనూ అడిగారు. అలాగే ఫ్యాక్టరీ వల్ల ఆ ప్రాంతంలో ఏర్పడే పరిస్థితులపై సంబంధిత జిల్లా అధికారుల అభిప్రాయాలనూ అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఫ్యాక్టరీపై దాడి, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంపై అధికారులు సీరియస్‌గా స్పందించినట్లు తెలిసింది.

కమిటీల ఏర్పాటు దిశగా..
జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో తలెత్తిన ఆందోళన నేపథ్యంలో ఇరువర్గాలతో చర్చించిన ఉన్నతాధికారులు దీనిపై కమిటీలు వేసే యోచనలో ఉన్నారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, భూగర్భజలాలు, మిషన్‌భగీరథ తదితర శాఖలకు చెందిన అధికారులతో ఒక కమిటీ, అలాగే రెండు గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులతో ఇంకో కమిటీ వేసే దిశగా యోచిస్తున్నారు. ఈ కమిటీలను ప్రస్తుతం ఇథనాల్ ఫ్యాక్టరీ ఉన్న ఏరియాలకు పంపించి అధ్యయనం చేయించేలా ప్లాన్ చేస్తున్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎఫ్‌ఏవో పద్మ

లక్ష్మణచాంద: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మ కేజీబీవీ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. వంటశాలను, సరుకుల గదిని పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళికతో చదివి టెన్ జీపీఏ సాధించాలని సూచించారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆమె వెంట ఎస్‌వో సవిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

'వన భోజనాలు కాదు.. వసతులు కల్పించండి'

- డీఎంకు ఆర్టీసీ ఉద్యోగుల వినతి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు

భైంసాటౌన్: ఆర్టీసీ సంస్థ ఉద్యోగులకు వన భోజనాల పేరిట వెచ్చిస్తున్న నిధులను కార్మిక ప్రయోజనాలకు ఉపయోగించాలని భైంసా డిపోకు చెందిన పలువురు ఉద్యోగులు కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్ అమృతను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాత టిమ్ పరికరాలు పనిచేయకపోవడంతో కండక్టర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వన భోజనాలకు కేటాయించిన నిధులతో కొత్త టిమ్ పరికరాలు తెప్పించాలని కోరారు. అలాగే డిపోలో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. కార్మికులకు రావాల్సిన రెండు పీఆర్సీ బకాయిలు, బాండ్ డబ్బులు, డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గంగయ్య, మహేందర్, ఏవీ రమణ తదితరులు ఉన్నారు.

'అవిశ్వాసం' ఆగింది



సమావేశంలో ఆర్డీవో, కమిషనర్, కౌన్సిలర్లు



ఆర్డీవోను నిలదీస్తున్న కౌన్సిలర్లు

- చివరి నిమిషంలో ట్విస్ట్ ఇచ్చిన చైర్మన్, వైస్ చైర్మన్
- హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న ఖానాపూర్ ప్రజాప్రతినిధులు
- స్టే ఆర్డర్ పరిశీలించి తాత్కాలికంగా వాయిదా వేసిన ఆర్డీవో
- కౌన్సిలర్ల ఆందోళన.. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

ఖానాపూర్: ఖానాపూర్ బల్దియా చైర్మన్, వైస్ చైర్మన్‌పై 9 మంది కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాసం ప్రక్రియ మరోసారి ఆగింది. అవిశ్వాసంపై శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి, నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు నేరుగా సమావేశానికి వచ్చారు. అయితే సమావేశం ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు, అవిశ్వాసం ఎదుర్కొనాల్సిన చైర్మన్, వైస్ చైర్మన్ ట్విస్ట్ ఇచ్చారు. తాము హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నట్లు సమాచారం ఇవ్వడంతో క్యాంపు నుంచి వచ్చిన కౌన్సిలర్లు కంగుతిన్నారు. ఆరు నెలల క్రితం కూడా అవిశ్వాసం ప్రకటించగా కోర్టు స్టేతో రాష్ట్రవ్యాప్తంగా అవిశ్వాస సమావేశాలు నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు తర్వాత ఖానాపూర్ కౌన్సిలర్లు మరోమారు అవిశ్వాసం నోటీసులు ఇచ్చారు. దీంతో గతనెల 14న ఖానాపూర్‌లో కౌన్సిలర్‌లతో సమావేశం నిర్వహించి ఆర్డీవో జనవరి 5న అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు నోటీసులు ఇచ్చారు.

సమావేశం ఏర్పాట్లు..
ఈమేరకు శుక్రవారం ఉదయం ఆర్డీవో రత్నకళ్యాని ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు నేరుగా సమావేశానికి వచ్చారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు సమావేశానికి వచ్చారు. చైర్మన్, వైస్ చైర్మన్ స్టే ఆర్డర్ చూపడంతో ఆర్డీవో అవిశ్వాసం చర్చపై ఓటింగ్ సమావేశం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు కౌన్సిలర్లు ఒక రోజు ముందే స్టే వచ్చినా.. తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని కౌన్సిలర్లు ఆర్డీవోను ప్రశ్నించారు. తమకు నోటీస్ ఇచ్చినందునే తాము సమావేశానికి వచ్చామని, స్టే రావడానికి కారణం ఎవరో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు.

ఆర్డీవోను అడ్డుకున్న కౌన్సిలర్లు..
అయితే ఆర్డీవో ఎలాంటి సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో కౌన్సిలర్లు వెళ్లి ఆమె వాహనాన్ని అడ్డుకున్నారు. కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడిన చైర్మన్, వైస్ చైర్మన్‌తో అధికారులు కుమ్మక్కై అవిశ్వాసాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అవినీతిలో అధికారుల భాగస్వామ్యం ఉందని, అందుకే ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు ఆర్డీవో వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. నిరసనలో కౌన్సిలర్లు అఫ్రీనా బేగం, పరిమి లత, నాయిని స్రవంతి, కిశోర్‌నాయక్, ఫౌజియా, విజయలక్ష్మి, కావలి సంతోష్, తొంటి శ్రీనివాస్, పాల్గొన్నారు.

తగ్గేదే లేదు..
అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు చైర్మన్, వైస్‌చైర్మన్ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని అవిశ్వాసం నుంచి తప్పించుకుంటున్నారని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్న సత్యం, కౌన్సిలర్లు ఆరోపించారు. అయినా అవిశ్వాస ప్రక్రియపై తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. నాలుగేళ్లలో జరిగిన అక్రమాలు, కుంభకోణాలను వెలికితీసి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అధికారుల తప్పిదంతో తాత్కాలికంగా వాయిదా పడ్డ అవిశ్వాసంపై కోర్టు తీర్పును గౌరవిస్తూనే, చివరి క్షణం వరకు పోరాటం చేస్తామన్నారు.

అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

ఖానాపూర్: మున్సిపల్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టినప్పటికీ కోర్టులో స్టే రావడంతో ధర్మమే గెలిచిందని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ కలీల్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. అవిశ్వాసం పెట్టడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. వీడీసీల నాయకులతోపాటు పట్టణ ప్రజల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అవిశ్వాసంపై స్టే రావడంతో వీడీసీల నాయకులతోపాటు పలువురు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని చైర్మన్, వైస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అందని ప్రసూతి సాయం..!

పట్టణానికి చెందిన ప్రవళిక ఏడాది క్రితం భైంసా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రసవించింది. మగ శిశువు జన్మించగా, కిట్ మాత్రమే అందించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం ఇప్పటి వరకు రాలేదు.. ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు 13 వేలకుపైగా మంది తల్లులకు ప్రసూతి సాయం అందాల్సి ఉంది.

- జిల్లాలో 13,513 మందికి పెండింగ్



భైంసాటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ప్రోత్సహించడంతోపాటు మాతాశిశు మరణాలు అరికట్టేందుకు గత ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పథకం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆడపిల్ల పుడితే మూడు దశల్లో రూ.13 వేలు, మగబిడ్డ ప్రసవిస్తే రూ.12 వేలు ఆర్థిక సహాయంతోపాటు ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్ అందించాలని నిర్ణయించారు. అలాగే పుట్టిన బిడ్డకు మూడున్నర నెలలకు, 9 నెలలకు టీకాలు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. కాగా, కొన్నేళ్లుగా కేసీఆర్ కిట్ మినహా ప్రసూతిసాయం అందడం లేదు. దీంతో అర్హులైన వారు సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రస్తుతం పేరు మార్చి...
కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కేసీఆర్ కిట్ పథకం పేరు మార్చి ఎంసీహెచ్ కిట్ పేరిట అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఎన్సీ నమోదు చేసుకుంటూ, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నారు. ప్రస్తుతం కిట్లు అందుబాటులో ఉండడంతో అందిస్తున్నారు. పెండింగ్ నిధులపై సంబంధిత అధికారిని వివరణ కోరగా, ఎలాంటి స్పష్టత లేదన్నారు. నూతన ప్రభుత్వం కొలువైన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ప్రసూతి సాయం నిధులు త్వరగా విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జిల్లాలో ప్రసూతి సాయం పెండింగ్ వివరాలిలా..

కేటగిరీ	అర్హులు	పెండింగ్
ఏఎన్సీ	37,892	13,513
డెలివరీ	24,515	9,561
3.5 నెలల టీకా	38,823	15,030
9 నెలల టీకా	31,104	13,052

నేటితో 'ప్రజాపాలన' ఆఖరు

- ఇప్పటి వరకు 2,44,919 దరఖాస్తులు



మామడ: దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించి చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసిపోనుంది. పదిరోజులపాటు గ్రామాలు, వార్డుల వారీగా సభలు నిర్వహిస్తున్నారు. ప్రతీ పల్లెలో, పట్టణాల్లోని ప్రతీ వార్డులో పథకాలకు అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉచితంగా ఇచ్చిన దరఖాస్తు పత్రంలో ప్రజలే స్వయంగా తమ వివరాలను పూర్తిచేసి ప్రజాపాలనలో అందించేలా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతీ దరఖాస్తును స్వీకరించిన వెంటనే ఓ నంబర్‌తో రశీదు కూడా ఇస్తున్నారు.

నేటితో పూర్తి..
డిసెంబర్ 28న ప్రారంభించిన ప్రజాపాలన జనవరి 6తో ముగుస్తుందని ముందే ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో డిసెంబర్ 31, జనవరి 01తేదీల్లో దరఖాస్తులను స్వీకరించలేదు. మొత్తం ఎనిమిది రోజులపాటు జిల్లాలో అన్నిరకాల దరఖాస్తులు కలిపి 2,44,919 స్వీకరించారు. మహాలక్ష్మి, రూ.500కే సిలిండర్, చేయూత పింఛన్, రైతుభరోసా, ఇందిరమ్మ ఇల్లు ఈ ఐదు గ్యారంటీలతో పాటు రేషన్‌కార్డు ఇతర పథకాలకు సంబంధించిన అర్హులను గుర్తించేందుకు ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటికే షెడ్యూల్ ప్రకారం దాదాపు గ్రామాలు, వార్డుల్లో సభలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాలు, వార్డుల్లో చివరిరోజైన శనివారం పూర్తిచేయనున్నారు.

ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు..

ఐదుగ్యారంటీలకు దరఖాస్తులు	2,10,557
ఇతర పథకాలకు దరఖాస్తులు	34,362
మొత్తం దరఖాస్తులు	2,44,919

ఎస్పీకి శుభాకాంక్షల వెల్లువ



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ జానకిషర్మిలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు ఇందులో జిల్లా జెడ్పీటీల ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దశరథ్ రాజేశ్వర్, మసిరుద్దీన్ ఖాద్రి, సురేందర్, విద్యాసాగర్, మహేందర్, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

గల్ఫ్ హామీల అమలుకు వినతి



లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన సుంచు భీమవ్వ, ఆమె కొడుకు వినయ్, కూతురు నిశిత గల్ఫ్ హామీ అమలు కోసం ప్రజాపాలనలో శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన కుటుంబ పెద్ద సుంచు రాజన్న 2022, నవంబర్‌లో గుండెపోటుతో అక్కడే మరణించాడు. దీంతో కుటుంబ అప్పుల్లో కూరుకుపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన నేపథ్యంలో ఈమేరకు దరఖాస్తు పెట్టుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల వినతి



వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని నిర్మల్ మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ కార్మికులు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును కోరారు. పెండింగ్ వేతనాలు, పీఎస్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో శ్రీహరిరావును కలిసి వినతిపత్రం అందించారు. తమకు రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని, 120 కార్మికులకు పీఆర్సీ డబ్బులు, 8 నెలల నుంచి పిఫ్ జమ చేయడం లేదని తెలిపారు. ప్రతినెలా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌: గ్రూప్‌ 1, 2, 3, 4 ఫౌండేషన్‌ కోర్స్‌ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్‌ సెంటర్‌ డైరెక్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు గ్రూప్‌ 1, 2, 3, 4 ఫౌండేషన్‌ కోర్సుకు అర్హులన్నారు. ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌ www.tsbcstudycircle.cgg.gov.inలో లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభించడం జరుగుతుందని, శిక్షణ నాలుగు నెలల పాటు అందించనున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వార్షికాదాయం రూ.5లక్షలలోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్‌, డిగ్రీ మార్కుల ఆధారంగా ఉంటుందని వివరించారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్‌ అందించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్‌ నంబర్‌ 08732–221280పై సంప్రదించాలన్నారు.

నూతన నియామకం


రాథోడ్‌ సంజీవ్‌నాయక్‌

ఇంద్రవెల్లి: బంజారా యువసేన ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మచ్చపూర్‌ గ్రామానికి చెందిన రాథోడ్‌ సంజీవ్‌నాయక్‌ను ఎన్నుకున్నట్లు శుక్రవారం మండల కేంద్రంలోని విలేకరులకు తెలిపారు. బంజారా యువసేన రాష్ట్ర అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్‌ సంజీవ్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమాజం కోసం నిరంతరం పని చేస్తున్న తన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కేసు

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారిపై పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్‌సింగ్‌ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

8న అప్రెంటీస్‌ మేళా

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఐటీఐ కళాశాలలో ఈ నెల 8న ఉదయం 10గంటలకు అప్రెంటిస్‌షిప్‌ మేళా నిర్వహించడం జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్‌ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కోసం వివిధ పరిశ్రమల్లో ఎంఎస్‌డీఈ, సీఈటీలో జాతీయ అప్రెంటిస్‌షిప్‌ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత విద్య, అర్హత ధ్రువీకరణ పత్రాలతో అప్రెంటిస్‌షిప్‌ వెబ్‌సైట్‌ http;//apprenticeshipindia.ogr/లో రిజిస్ట్రేషన్‌ చేసుకొని మేళాకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9490202037 సంప్రదించాలని కోరారు.

‘మహా’.. భారం!

- ఆర్టీసీ ఉద్యోగులపై పెరిగిన ఒత్తిడి
- కండక్టర్లు, డ్రైవర్లపై ప్రభావం


టికెట్లు ఇష్యూ చేస్తున్న కండక్టర్‌ (ఫైల్‌)

రీజియన్‌ పరిధిలోని ఉద్యోగుల సంఖ్య

డిపో	ఉద్యోగులు
ఆదిలాబాద్‌	440
భైంసా	268
నిర్మల్‌	468
ఉట్నూర్‌	120
ఆసిఫాబాద్‌	321
మంచిర్యాల	516
ఆర్‌ఎంవో	52
మొత్తం	2185

ఆదిలాబాద్‌: ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్లది కీలకపాత్ర. సంస్థ పురోగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ ప్రగతి రథ సారథులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా పరిష్కారం కోసం వీరికి ఎదురుచూపులు తప్పడం లేదు. తాజాగా మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో తమపై ఒత్తిడి, పని భారం పెరిగిందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం, కేఎంపీఎల్‌ పేరిట ఒత్తిడి..

సంస్థను లాభాల బాట పట్టించేందుకు అధికారులు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సిబ్బందిపై వీరు ఒత్తిడి తీసుకువస్తున్నారు. డ్రైవర్ల విషయానికి వస్తే కేఎంపీఎల్‌ సాధించాలంటూ, అలాగే కండక్టర్లపై ఆదాయం తీసుకురావాలంటూ ప్రెషర్‌ చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రయాణికుల సంఖ్య పండుగలు, సాధారణ రోజుల్లో భిన్నంగా ఉంటుందని, ఒకే రకమైన ఆదాయం ఏ విధంగా తీసుకువస్తామని కండక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఇక ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటే కేఎంపీఎల్‌ ఎలా సాధ్యమవుతుందని డ్రైవర్లు తలలు పట్టుకుంటున్నారు.

‘మహాలక్ష్మి’తో తిప్పలు..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్ర యాణ సౌకర్యం కల్పిస్తూ మహాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ప్రా రంభం నుంచి రీజియన్‌ వ్యాప్తంగా మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. పరిమితికి మించి బస్సులు కిక్కిరిసిపోతుండటంతో అటు పురుషులకు, మహిళల కు (జీరో)టికెట్లను ఇచ్చే క్రమంలో తడబా టుకు గురవుతున్నారు. ఈ సమయంలో పొరపాట్లు జరుగుతుండడంతో అధికారులు వారిని మందలిస్తున్నారు. అలాగే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుండడంతో నిర్ణీత సమయానికి బస్సులు గమ్యస్థానాలకు చేరుకోవడం లేదు. కేఎంపీఎల్‌ సైతం సాధించలేని పరిస్థితి ఎదురవుతున్నాయి. దీంతో డ్రైవర్లపై అధికారులు రుసరసలాడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో సరిహద్దు వరకు మహిళలకు జీరో టికెట్‌ ఇచ్చి ఆ తర్వాత మరో టికెట్‌ ఇవ్వాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులవుతున్నాయని కండక్టర్లు పేర్కొంటున్నారు. ఒక్కోసారి పలువురు ప్రయాణికులు వా గ్వాదానికి దిగుతున్నారు. దాడులకు సైతం వెనుకాడడం లేదు. ఇటీవలే ఆదిలా బాద్‌ డిపోకు చెందిన ఓ కండక్టర్‌పై ప్ర యాణికుడు దాడి చేయడం గమనార్హం.

ఒత్తిడితో ప్రమాదాలు...

ఉద్యోగులపై ఒత్తిడి కారణంగా ఆర్టీసీలో ప్రమాదాల సంఖ్య సైతం పెరుగుతుంది. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో పలువురు ప్రాణాలు సైతం కోల్పోయారు. మరోవైపు పలువురు దీర్ఘకాలిక వ్యాధులకూ గురవుతున్నారు. విధి నిర్వహణలో హార్ట్‌ ఎటాక్‌ వంటివి వచ్చి బస్సులకు ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు సైతం ఉన్నాయి.

సేఫ్టీ లేకుండా పోయింది



విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ప్రారంభం తర్వాత అనేక ఇబ్బందులు వస్తున్నాయి. సీట్లు దొరక్కపోతే ప్రయాణికులు వాగ్వాదానికి దిగుతున్నారు. కండక్టర్లు, డ్రైవర్లకు సేఫ్టీ లేకుండా పోయింది. బస్సుల సంఖ్యను పెంచితే బాగుంటుంది. – సర్వే భీమ్‌ రావు, కండక్టర్‌

మానసికోల్లాసం కోసం వనభోజనాలు


మాట్లాడుతున్న డీఎం ప్రతిమారెడ్డి


భోజనాలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నిర్మల్‌టౌన్‌: ఆర్టీసీ ఉద్యోగుల మానసికోల్లాసం కోసం వనభోజనాల కార్యక్రమం చేపట్టినట్లు డిపో మేనేజర్‌ ప్రతిమారెడ్డి అన్నారు. నిర్మల్‌ ఆర్టీసీ డిపోలో శుక్రవారం వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో మహాలక్ష్మి పథకం ద్వారా అలసిపోయిన ఆర్టీసీ ఉద్యోగులకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా డాక్టర్‌ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్‌ మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులకు కొద్దిపాటి ఉపశమనం కలిగించాలని వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మల్‌ డిపోకు మూడు రాజధాని, ఒక సూపర్‌ లగ్జరీ బస్సులను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఆర్టీసీని ఆదరిస్తున్నారన్నారు. డిపోకు మరికొన్ని పల్లె వెలుగు బస్సులు అవసరం ఉందని నివేదిక పంపినట్లు తెలిపారు. డిప్యూటీ రీజినల్‌ మేనేజర్లు ప్రణీత్‌, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

రాజకీయంగా అవకాశాలు కల్పించాలి

- ఆదివాసీ పర్ధాన్‌ సమాజ్‌ నేతల డిమాండ్‌


మాట్లాడుతున్న అడహక్‌ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్‌: ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ పర్ధాన్‌ సమాజ్‌కు నామినేటెడ్‌ పదవుల్లో ప్రాధాన్యతను కల్పించి రాజకీయంగా గుర్తింపునివ్వాలని ఆదివాసీ పర్ధాన్‌ సమాజ్‌ అడహక్‌ కమిటీ సభ్యులు పూసం ఆనంద్‌రావ్‌, అనుసూయలు డిమాండ్‌ చేశారు. వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో ఆదివాసీ పర్ధాన్‌ సమాజానికి చెందిన అభ్యర్థులకు ఎంపీ టిక్కెట్‌లు కేటాయించాలని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్‌ సమాజ్‌కు ఆయా పార్టీలు రాజకీయంగా గుర్తింపునివ్వాలనే ఉద్దేశంతో పర్ధాన్‌ సమాజ్‌ను ఐక్యత చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. ఐక్యతను చాటుకుంటేనే అన్ని రంగాల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. సమాజ్‌ అభివృద్ధికి చేస్తున్న కృషిలో పర్ధాన్‌ సమాజ్‌లోని మేధావులు, ఉద్యోగులు, యువకులు, మహిళలు, నిరుద్యోగులు భాగస్వాములై సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆదివాసీ పర్ధాన్‌ సమాజ్‌ కార్యవర్గం కాల పరిమితి ముగిసినందునా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ముందుగా పర్ధాన్‌ సమాజ్‌ మండల కమిటీలను నియమించనున్నట్లు వివరించారు. అందులో భాగంగానే ఆదివారం ఉదయం 11 గంటలకు బేల, మధ్యాహ్నం 2గంటలకు జైనథ్‌ మండలాల కమిటీలను నియమించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆదిలాబాద్‌, బోథ్‌ డివిజన్‌ పరిధిల్లోని మండల కమిటీల నియామకం అనంతరం ఆదిలాబాద్‌, బోథ్‌ డివిజన్‌ల కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. విడతల వారీగా నియమిస్తున్న మండల, డివిజన్‌ కమిటీల నియమాకాలకు వారికి కేటాయించిన తేదీలలో పర్ధాన్‌ సమాజ్‌ కులస్తులు అందుబాటులో ఉండి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పర్ధాన్‌ సమాజ్‌ అడహక్‌ కమిటీ సభ్యులు గేడం మాధవ్‌, సెడ్మకి సుభాష్‌, మడావి దిగంబర్‌, అఖిల భారతీయ పర్ధాన్‌ సమాజ్‌ ఉద్ధన్‌ సంఘటన్‌ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్‌ ఉన్నారు.

గురుకృప దినోత్సవానికి ఏర్పాట్లు


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్‌ జనార్దన్‌

నార్నూర్‌: ఈ నెల 11న మండలంలోని కొత్తపల్లి–హెచ్‌ జాతీయ బంజారా దీక్షా భూమి వద్ద నిర్వహించే గురుకృప దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ అన్నారు. గురువారం మండలంలోని దీక్షాభూమి వద్ద దీక్ష గురువు శ్రీసంత్‌ ప్రేంసింగ్‌ మహారాజ్‌ సమక్షంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నిర్వహణపై కమిటీ అధ్యక్షుడు జాదవ్‌ రెడ్డి నాయక్‌తో చర్చించారు. లక్ష మందితో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నెల 11న గురుకృప దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బంజారాలకు మహారాష్ట్రలోని పొరదేవి తర్వాత తెలంగాణలోని కొత్తపల్లి –హెచ్‌ జాతీయ బంజారా దీక్ష భూమి రెండోవ స్థానంలో ఉంటుందన్నారు. దీక్ష గురువు శ్రీ సంత్‌ ప్రేంసింగ్‌ మహారాజ్‌ ఆధ్వర్యంలో మహాపూజ ఉంటుందని తెలిపారు. జాతర ఉత్సవాలకు ఈ నెల 20వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ డీఎంను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్‌ నారాయన్‌, రాథోడ్‌ రమేశ్‌, రాథోడ్‌ రామేశ్వర్‌, ఆదివాసీ నాయకుడు మెస్రం హన్మంతరావు, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ కాంతరావు దుర్గే, సర్పంచ్‌ రాథోడ్‌ విష్ణు, ఎంపీటీసీ పరమేశ్వర్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ రాథోడ్‌ సుభాస్‌, పీర్టీయూ జిల్లా నాయకుడు రాథోడ్‌ సుధాకర్‌ పాల్గొన్నారు.







కలెక్టరేట్‌లో ‘ప్లాస్టిక్‌ బాటిల్స్‌’ రీయూజ్‌

కలెక్టర్‌ కార్యాలయంలో అధికారిక సమావేశాలు ఎన్నో నిర్వహిస్తుంటారు. ఈ సమావేశాలకు పలువురు ఉన్నతాధికారులు హాజరవుతుంటారు. అయితే సమావేశ మందిరంలో అధికారుల కోసం తీసుకువచ్చిన వాటర్‌బాటిల్స్‌ పడేయకుండా తాగిపడేసిన వాటర్‌ బాటిల్స్‌ను రీసైకిల్‌ చేస్తున్నారు. ఆ బాటిళ్లలో కలెక్టర్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్‌ ప్లాంట్‌లో మళ్లీ నీటిని నింపుతూ అధికారులకు అందిస్తున్నారు. దీనిని చూసిన పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్‌ నిర్మల్‌

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్‌ గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. ఖానాపూర్‌ మండలం విద్యానగర్‌కి చెందిన ముగ్బుల్‌ఖాన్‌ (68) గురువారం సాయంత్రం ఖానాపూర్‌ నుంచి నిర్మల్‌ పట్టణానికి స్కూటీపై పని నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని నర్సాపూర్‌ ఫారెస్ట్‌ చెక్‌పోస్టు దగ్గర ఎదురుగా వచ్చిన బైక్‌ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్బుల్‌ఖాన్‌ తీవ్రంగా గాయపడగా స్థానికులు అతడిని అంబులెన్సులో నిర్మల్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రమాదానికి కారణమైన మామడకు చెందిన అంబటి సాయిరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు దుర్మరణం


సంతోష్‌ (ఫైల్‌)

నిర్మల్‌రూరల్‌: జిల్లా కేంద్రం శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సెక్యూరిటీ గార్డు దుర్మరణం చెందినట్లు రూరల్‌ ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం... నర్సాపూర్‌(జి) మండల కేంద్రానికి చెందిన బిట్లింగు సంతోష్‌(42) కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని యాక్సిస్‌ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని జిల్లా కేంద్రంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మండలంలోని తలవేద గ్రామ శివారులో నేషనల్‌ హైవే 61పై ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్‌ షాక్‌తో మహిళ రైతు మృతి


కేవల్‌బాయి మృతదేహం

తానూరు: మండల కేంద్రానికి చెందిన కేవల్‌బాయి (35) మహిళ రైతు గురువారం సాయంత్రం వ్యవసాయ పొలంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కేవల్‌బాయి గురువారం తన సొంత వ్యవసాయ పొలంలో పనులు చేసేందుకు వెళ్లింది. సాయంత్రం బోరు మోటారు ఆఫ్‌చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కేవల్‌బాయి తోట నుంచి రాకపోవడంతో భర్త గౌతం అక్కడికి వెళ్లి చూడగా మృతి చెందినట్లు కనిపించింది. విషయం తెలుసుకున్న ఎస్సై సందీప్‌ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు భర్త గౌతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

ముగిసిన సినిమా షూటింగ్‌


షూటింగ్‌ సమయంలో..

నేరడిగొండ: కుంటాల జలపాతం వద్ద స్వాగ్‌ పీపుల్స్‌ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై హీరోలు విష్ణు, కిరిటీలతో పాటు హీరోయిన్‌గా రీతువర్మ నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం కుంటాల జలపాతం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ సన్నివేశాలు పూర్తయ్యాయి. దీంతో షూటింగ్‌ను ఈ ప్రాంతంలో ముగించడం జరిగిందని డైరెక్టర్‌ అషిత్‌ గోలి తెలిపారు. కాగా అటవీ శాఖ అధికారులు షూటింగ్‌ పూర్తయ్యేంత వరకు వారికి సహకారం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు షూటింగ్‌ సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు. షూటింగ్‌కు సహకరించిన వారికి డైరెక్టర్‌, హీరోలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మనీషా

మంచిర్యాలఅర్బన్‌: ఢిల్లీలో ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి కళోత్సవ్‌ పోటీలకు స్థానిక కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మనీషా డ్రామా సోలో విభాగంలో జాతీయస్థాయికి ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు స్పెషలాఫీసర్‌ స్వప్న తెలిపారు.

ఆలిండియా పోటీలకు సుజిత్‌..

రాజస్థాన్‌ జేజేటీయూ ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు సౌత్‌ వెస్ట్‌ ఇంటర్‌ యూనివర్సిటీ నేషనల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు నిర్వహించగా వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని సుజిత్‌ పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఆల్‌ ఇండియా యూనివర్సిటీ తైక్వాండో చాంపియన్‌ షిప్‌నకు ఎంపికై నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది.

జెడ్పీటీసీ సభ్యురాలి ఇంటికి నిప్పు

బెజ్జూర్‌: గుర్తు తెలియని దుండుగులు బెజ్జూర్‌ జెడ్పీటీసీ సభ్యురాలు పంద్రం పుష్పలత ఇంటికి గురువారం రాత్రి నిప్పంటించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమినిలోని ఇంటిలో జెడ్పీటీసీ సభ్యురాలు పత్తి నిల్వ చేశారు. ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటికి నిప్పంటించారు. మంటలు చెలరేగగా స్థానికులు గమనించి ఆర్పివేశారు. అప్పటికే రూ.20వేల నష్టం జరిగినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు. తన ఇంటికి నిప్పంటించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విక్రమ్‌ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులకు అప్పగింత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి మహాలక్ష్మీవాడకు చెందిన మతిస్థిమితం లేని ప్రసన్న అనే వ్యక్తిని ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక సీఐ కృష్ణ తెలిపారు. అతడు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసన్న ఊత్కూరు గ్రామంలో కొందరిని ఇబ్బందులకు గురిచేయడంతో స్థానికులు చితకబాది పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కాగా, సదరు వ్యక్తిని వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


రంగయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంపీ

ఆదిలాబాద్‌: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కడార్ల రంగయ్య– వీణ దంపతులను ఎంపీ సోయం బాపూరావు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కుమురంభీమ్‌ ఆసిఫాబాద్‌ జిల్లా కెరమెరి మండలం మారుమూల గ్రామమైన సావర్కేడ్‌ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కడార్ల రంగయ్య జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై ఎంపీ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగయ్య అత్యుత్తమ బోధనతో జాతీయస్థాయిలో గుర్తింపు సాధించారని కొనియాడారు. సావర్కేడ్‌ గ్రామ అభివృద్ధికి పీఎం శ్రీ పథకం కింద ఇటీవలే రూ.2కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు, గ్రామాభివృద్ధికి తనవంతుగా చేయూతను అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అత్తింటి ఎదుట కోడలు బైఠాయింపు


కూతురుతో అత్తింటి ఎదుట బైఠాయించిన నేహ

ఆదిలాబాద్‌టౌన్‌: న్యాయం చేయాలని కోరుతూ అత్తింటి ఎదుట కోడలు బైఠాయించిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం... ఇంద్రవెల్లి మండలం ముత్నూర్‌ గ్రామానికి చెందిన నేహకు 2019లో ఆదిలాబాద్‌ పట్టణానికి చెందిన ఓ యువకుడితో వివాహమైంది. ఉద్యోగ రీత్యా ఆమె భర్త నాగ్‌పూర్‌లోని ప్రైవేట్‌ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడని, భర్త తరచుగా వేధింపులకు గురిచేసినా భరించినట్లు వాపోయింది. గర్భవతి కావడంతో పుట్టింటికి పంపించాడని, దీంతో బిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపింది. గతేడాది నుంచి భర్త కాపురానికి తీసుకు వెళ్లడం లేదని, అత్తమామలు సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పలుమార్లు పోలీసులు సైతం కౌన్సెలింగ్‌ ఇచ్చినా అతడి తీరులో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డులో భర్త, అత్తమామలు అద్దెకు ఉంటున్న నివాసానికి శుక్రవారం వెళ్లగా ఇంట్లోకి రానివ్వకుండా కొట్టారని, సెల్‌ఫోన్‌ పగలగొట్టారని పేర్కొంది. అనంతరం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారని, అయినప్పటికీ తాను ఇక్కడే కూర్చున్నట్లు తెలిపింది. తనకు న్యాయం కావాలని కూతురుతో అక్కడే బైఠాయించింది.

ముగ్గురి మృతి కారకుడికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌: మద్యం మత్తులో అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల మరణానికి కారకుడైన కాగజ్‌నగర్‌కు చెందిన పుల్ల కృష్ణకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ శుక్రవారం తీర్పు చెప్పారు. లైజనింగ్‌ అధికారి కే సాగర్‌, కాగజ్‌నగర్‌ సబ్‌ డివిజనల్‌ లైజనింగ్‌ అధికారి బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా కాగజ్‌నగర్‌ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఫిబ్రవరి 2, 2020న సాయంత్రం ఈజ్‌గాం సమీపంలో పట్టణానికి చెందిన పుల్ల కృష్ణ మద్యం మత్తులో పత్తి లోడ్‌తో ఉన్న బొలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు మృతి చెందారు. ఆటో డ్రైవర్‌ మనోజ్‌ ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు చార్జిషీట్‌ దాఖలు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కాగా న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ తరపున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ జగన్మోహన్‌ రావు వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్‌ అధికారులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.